క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఎన్.రాంచందర్‌రావును బుధవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించినట్లు శంకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పొరేటర్లు ఎడ్ల మల్లేశ్, జిల్లె ప్రభాకర్‌రెడ్డి, నాయకులు నరేంద్రచారి, జనార్దన్, నరేశ్, రామిడి మహేందర్‌రెడ్డి, ఆర్.శేఖర్‌రెడ్డి, నవీన్‌కుమార్, లోకేశ్ ఉన్నారు.

మీర్‌పేట బీజేపీ-2 కమిటీ నియామకం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ-2 కమిటీని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో నియమించినట్లు నూతన అధ్యక్షుడు ముఖేశ్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా దామోదర్‌రెడ్డి, డి.కృష్ణ, సుధాకర్ నేత, జగన్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులుగా కే.వెంకటేశ్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్, కార్యదర్శులుగా నగేశ్‌యాదవ్, సుభాష్ గౌడ్, లక్ష్మి, లావణ్య, కోశాధికారిగా లీలావతి నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు పార్టీ మండల స్థాయి సమీక్ష

కందుకూరు: బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని గురువారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమీక్ష ప్రారంభం కానుందన్నారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములుయాదవ్, అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మండల ఎన్నికల కన్వీనర్ తూళ్ల వీరేందర్‌గౌడ్, మండల కన్వీనర్ లక్ష్మణ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. సమీక్షకు పార్టీ శ్రేణులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు

కందుకూరు: మండల పరిధి కొత్తగూడలో నూతనంగా నిర్మిస్తున్న దేవాలయంలో ఈ నెల 25న శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమాత చండీ ఉపాసకులు రేవెళ్ల రాజుశర్మ ఆధ్వర్యంలో శ్రావణం మొదటి శుక్రవారం రోజున ఉదయం 6 గంటల నుంచి 8.30 వరకు సామూహిక లక్ష కుంకుమార్చన పూజ, 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఐశ్వర్యలక్ష్మి, అష్టలక్ష్మి మహాయాగం జరపనున్నామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు.

భారీ వర్షాలతో అప్రమత్తం

తుక్కుగూడ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మున్సిపల్, జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. బుధవారం తుక్కుగూడ పురపాలిక కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, కందుకూరు, మహేశ్వరం మండలాలు, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లు, సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్‌లో చాలా ముంపు ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలను గుర్తించి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బడంగ్‌పేట్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, చంపాపేట్ డివిజన్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీజీఎస్‌పీడీసీఎల్ రీజినల్ నాయకుల పర్యవేక్షణలో కమిటీని నియమించారు. చంపాపేట్ డివిజన్ అధ్యక్షుడిగా బి.కిషన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డి.గణేశ్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా వి.జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.కుమారస్వామి, జయింట్ సెక్రెటరిగా ఎం.మహేశ్, ఫైనాన్స్ సెక్రెటరి జె.పరంజ్యోతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా డి.చంద్రమౌళి, బి.ప్రవీణ్‌కుమార్, బి.శ్రీనివాస్, వి.హరిలాల్‌ను నియమించారు. కార్యక్రమంలో రీజినల్ ప్రెసిడెంట్ సూర్యకుమార్, రీజినల్ జనరల్ సెక్రటరి (సరూర్‌నగర్ సర్కిల్), ఎస్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే జల్లెడే..




మంచాల తహసీల్దార్ కార్యాలయం

- కురుస్తున్న తహసీల్ కార్యాలయం
- తడుస్తున్న దస్త్రాలు
- పెచ్చులూడుతున్న పైకప్పు
- జడుస్తున్న సిబ్బంది

మంచాల: ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరే శాఖల్లో రెవెన్యూ ఒకటి. ఇది కీలకమైనది కూడా.. అలాంటి మంచాల తహసీల్దార్ కార్యాలయం.. గట్టిగా నాలుగు చినుకులు పడితే జల్లెడను తలపిస్తోంది. నలుమూలలా ఉరుస్తూ.. కార్యకలాపాలకు తీవ్రం ఆటంకం కలిగిస్తోంది. సిబ్బంది, ప్రజలకు ఇబ్బందిగా మారింది. అందులోని దస్త్రాలు తడిసి ముద్దవుతున్నాయి.

ఎక్కడికక్కడ నెర్రలు

మంచాల మండల కేంద్రంలో 30 ఏళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయం నిర్మించారు. కానీ అనతి కాలంలోనే నాణ్యత లోపం బయటపడింది. భవనం ఎక్కడికక్కడ నెర్రలు వారింది. దశాబ్ద కాలంగా స్లాబ్ కురుస్తోంది. ఒకటి రెండు గదులతో పాటు, వరండాలో పై పెచ్చులు ఊడుతున్నాయి. నీరు కారుతోంది. ఫలితంగా కార్యాలయం శిథిలావస్థకు చేరుతోంది.



పెచ్చులూడుతున్న పైకప్పు

పాడవుతున్న విద్యుత్ తీగలు

పదేళ్లుగా కార్యాలయం కురుస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో భవనం క్రమంగా మరింత శిథిలావస్థకు చేరువవుతోంది. ప్రస్తుత వానలకు పైకప్పు కురుస్తుండటంతో.. ఫైళ్లు, విద్యుత్ సరఫరా చేసే తీగలు పాడై పోతున్నాయి. పెచ్చులు ఊడుతుండటంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కార్యాలయానికి మరమ్మతులు చేయించాలని సిబ్బందితో పాటు ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై.. తహసీల్దార్ ఎం.వీ. ప్రసాద్ వివరణ కోరగా, మరమ్మతు చేయిస్తే బాగుంటుందని పేర్కొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

మీర్‌పేట: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు బుధవారం బాలాపూర్ మండలంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దాసరి అరవింద్ తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ నాయకులు బంద్ చేయించారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బంద్‌లో మనోజ్, అఖిల్, కిరణ్‌నాయక్, సాయికుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేటలో ఓ ప్రైవేటు విద్యాసంస్థను బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బిల్లును అడ్డుకునేవారు.. బీసీ ద్రోహులు



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే వారు బీసీ ద్రోహులుగా మిగిలిపోతారని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బిల్లు విషయంలో కొందరు బీజేపీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఇది సరికాదన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం త్వరగా ఆమోదించేలా, అన్ని రాజకీయ పార్టీలు చొరవ చూపాలని కోరారు. బిల్లు ఆమోదంలో కేంద్రం జాప్యం చేస్తుందని విమర్శించారు. బిల్లు పాసైతేనే స్థానిక ఎన్నికల్లో బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర నిర్లక్ష్యం వీడాలని, లేని పక్షంలో బీసీల ఉద్యమ కార్యాచరణ తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, బీక్యానాయక్, బీచ్యానాయక్, ,హన్మానాయక్, చేగూరి వెంకటేశ్, రామకృష్ణ, యాదయ్య తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలి

తహసీల్దార్ అజాంఅలీ



సమావేశంలో మాట్లాడుతున్న అజాంఅలీ

కేశంపేట: ప్రజాపాలనలో ప్రజలు రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ అజాంఅలీ సూచించారు. కేశంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మా ట్లాడుతూ..మండల వ్యాప్తంగా ప్రజాపాలన లో రేషన్‌కార్డుల కోసం 2,600ల దరఖా స్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటికే 1,700ల దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు వెల్లడించారు. ఆయా గ్రామాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు మిగిలిన 900ల దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలని కోరారు. పరిశీలనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్ష నేడు

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో గల బస్వ జంగయ్యగౌడ్ ఫంక్షన్ హాలులో స్థానిక సంస్థలపై మండల నాయకులతో గురువారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు టి.యాదిశ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమవుతుందని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిలతో పాటు పలువురు నాయకులు హాజరవుతున్నారన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

మంచాల: విధినిర్వహణలో గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ పసుల వెంకటేశ్ కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం మృతుడి దశదినకర్మ నేపథ్యంలో.. 2007 బ్యాచ్ కానిస్టేబుళ్లు రూ.2.13,500లను చెక్కు రూపంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామానికి చెందిన బూడిద రాంరెడ్డి బీఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.30 వేలు సహాయం అందజేశారు.

రూ.40 వేలు

ఇబ్రహీంపట్నం: కానిస్టేబుల్ వెంకటేశ్ కుటుంబానికి.. ఛాంపియన్స్ క్రికెట్ టీం సభ్యులు అండగా నిలిచారు. బుధవారం రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మంచాల మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్.. పది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే.



బాధిత కుటుంబ సభ్యులకు సహాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

ఆలూరు రోడ్డుకు మరమ్మతులు చేపడతాం

- ఆర్‌అండ్‌బీ ఈఈ రవీందర్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

చేవెళ్ల: ఆలూరు రోడ్డు పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఈఈ రవీందర్‌కుమార్ అన్నారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఆలూరు రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో మంగళవారం 'ఆలూరు మార్గం.. ఆగమాగం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం స్పందించారు. ఆర్‌అండ్‌బీ ఈఈతో పాటుగా జేఈఈలు అజయ్‌కుమార్ అనురాధ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్ ఈ రోడ్డును పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీళ్ల నిలవటంతో నీరు బయటకు పోయేలా చేస్తున్నామన్నారు. నీరు పోతే కానీ పనులు చేయటానికి వీలుపడదని, ప్రస్తుతానికి గుంతలు పూడ్చే పనులు చేపడతామని తెలిపారు. ఈ రోడ్డు మంజూరై కాంట్రాక్టర్‌కు అప్పగించిన అతడి నిర్లక్ష్యంతో పనులు ఆగినట్లు తెలిపారు. ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడినందుకు గ్రామస్తులు, నాయకులు మట్టిని తవ్విపోయటంతో వర్షానికి పూర్తిగా బురదమయంగా మారిందన్నారు. గుంతల్లో ఉన్న నీళ్లను తొలగించి ఆరిన తరువాత పనులు చేపడుతామన్నారు.



రోడ్డును పరిశీలిస్తూ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

యూరియా వాడకంపై తనిఖీలు

కొందుర్గు: వ్యవసాయ పంటలకు వినియోగించే యూరియాను ఇతర పరిశ్రమలకు వాడుతున్నారనే ఆరోపణతో తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఏఓ సురేష్‌రెడ్డి, ఎస్ఐ రవీందర్‌నాయక్ బుధవారం పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. కొందుర్గు, ఆగిర్యాల, తంగెళ్లపల్లి తదితర గ్రామాల్లో గల పౌల్ట్రీ పరిశ్రమ ల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమల నిర్వాహకులు వ్యవసాయానికి ఉపయోగించే యూరియాను అనుమతులు లేకుండా ఇతర వాటికి ఉపయోగించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోళ్లకు వినియోగించే దాణాలో ఏఏ పదార్థాలు ఉంటాయే ఆ సంచులపై నమోదు చేయాలని సూచించారు.

టెంట్‌హౌస్ సామగ్రి అందజేత

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీలో గల కట్టపోచమ్మ మైసమ్మ ఆలయానికి బుధవారం పట్టణానికి చెందిన రోమియో రమేశ్ టెంట్ హౌస్ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా ధృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కాలనీవాసులు, దాతల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతనతో దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం దాత రమేశ్ దంపతులను సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అందె రాజేశ్వర్, అందె జంగరాజ్, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

కొత్తూరు: మహిళలను ఆర్థికంగా మరింత బలో పేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇందులో భాగంగా ఆయన బుధవారం మండలంలోని గూడూరు, తీగాపూర్ గ్రామాల్లో డ్వాక్రా భవనాల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మహిళా సంఘాల కోసం సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు మహిళా సంఘాలకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. అంతేకాకుండా వారిని ఆర్థికంగా బలోపే తం చేయడానికి స్వయం ఉపాధి ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, అంజనేయులు, కొమ్ము కృష్ణ, నరేశ్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, రమేశ్, మెండె కృష్ణ, జంగ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



మొయినాబాద్: ఎల్కగూడలో బోనాల ఊరేగింపు



షాద్‌నగర్: అమ్మవారి తొట్టెల ఊరేగింపు

షాద్‌నగర్: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విద్యుత్ కాలనీలో బుధవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, బీఆర్ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో పోతురాజుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మొయినాబాద్: మండల పరిధిలోని ఎల్కగూడలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో మాజీ సర్పంచ్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మించాలి

డీఎస్పీ మండల అధ్యక్షుడు మహిపాల్

కేశంపేట: వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వాగుపై బ్రిడ్జి నిర్మించాలని డీఎస్పీ మండల అధ్యక్షుడు మహిపాల్ మహారాజ్ అన్నారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామ శివారు నుంచి పెద్దవాగు నిండుగా ప్రవహిస్తోందని, దీంతో ఆ రోడ్డులో రాకపోకలకు గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయన ఆరోపించాడు. అధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో కొప్పు శ్రీకాంత్, పాపకంటి అభిరామ్, భాను తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కండి

షాద్‌నగర్: యువత నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మాజీ కౌన్సిలర్ రాజేందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చటాన్‌పల్లి సమీపంలోని రెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు విజేందర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రాజు, శివనాగయ్య, రామకృష్ణారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, అశోక్, నర్సింహారెడ్డి, వెంకట్‌నాయక్, శ్రీనివాస్, చందు, నాయకులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులు చేపట్టాలి

ఇబ్రహీంపట్నం: అసంపూర్తి పనులతో నిలిచిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ పలువురు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ వద్ద భవనాన్ని స్లాబ్ వరకు నిర్మించి వదిలి పెట్టారని తెలిపారు. ఈ కార్యాలయన్ని ఇక్కడే నిర్మిస్తే పాతపట్నం అభివృద్ధి చెందుతుందని భావించిన స్థానికులకు.. ఇది నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్.. నిర్మాణ పనులను ప్రారంభించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో పాత బస్తీవాసులు బండి మహేశ్, రాఘవేందర్, సురేష్, మల్లేశ్, బస్వపురం గోవర్ధన్, రోడ్డ కిష్టయ్య, నాగరాజు, ఐలేష్‌గౌడ్, యంజాల బాల్‌రాజ్, ముత్యాల యాదయ్య, తమ్మళ్ల కృష్ణ, ముత్యాల చందు, శ్యామ్, గుర్జని కుమార్, శ్రీనివాస్, శివ, కౌశలప్ప, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాతబస్తీ వాసులు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

హిందూ సేవా సమితి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ వెంకటరాధాకృష్ణ



విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేస్తున్న సొసైటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలని హిందూ సేవా సమితి ఎడ్యుకేషనల్ సొసైటీ, దన్మయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ వెంకటరాధాకృష్ణ అన్నారు. బుధవారం ఆ సొసైటీ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేశారు. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధతో విద్యనభ్యసించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కృషి, పట్టుదల ఉంటే విజయ తీరాలకు చేరుకుంటారన్నారు. యువత మత్తుకు బానిసలై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం దాతలకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవుల మృతి



ఆవుల కళేబరం వద్ద రోదిస్తున్న బాధిత రైతు కుటుంబీకులు

కడ్తాల్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన బుధవారం కడ్తాల్ మండలం గానుగుమార్ల తండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన నేనావత్ సేవ్యాకు చెందిన పాడి ఆవులు.. మేత మేసుకుంటూ వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాయి. వాటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి భానునాయక్.. ఘటనా స్థలానికి వెళ్లి, వివరాలు సేకరించారు. ప్రమాదం గురించి విద్యుత్ శాఖ అధికారులకు తెలిపి, బాధిత రైతుకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రమాద స్థలాన్ని విద్యుత్ లైన్‌మెన్ బుచ్చిరెడ్డి తదితరులు పరిశీలించారు.